
स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
...शाली अतीत - उज्वल भविष्य Glorious Past-Brighter Future

# బేతాళుడు చెప్పిన నేటి కథ

తటవర్తి రామచంద్రరావు



పట్టువదలని విక్రమార్కుడు మళ్ళీ చెట్టెక్కి శవాన్ని ఎప్పటిలా భుజాన వేసుకుని తిరుగు ముఖం పట్టాడు.

శవంలో తిష్టవేసుక్కూర్చున్న బేతాళుడు ''ఎంతో శ్రమపడి ఏకాగ్రతతో లక్ష్యసాధన చేస్తున్న మహారాజా! ఇంతకాలంగా నీకు రాజుల కథలు చెపుతూ వచ్చాను. పాపం, నీకు బోరు కొడు తోందేమో వెరైటీగా ఉంటుందని భవిష్యత్తులోని రాజకీయ నాయకుడి కథొకటి చెపుతాను. నీకు వినోదంగాను, ఉల్లాసంగాను ఉంటుంది విను'' అన్నాడు.

***

దిరుగుండ దిబ్బ అనే ఆ దేశంలో తల మార్పిడి తాతారావు అనే రాజకీయ నాయకుడొకడుండేవాడు. ఎన్నికలకి ముందు ప్రజలకోసం ఏం చేస్తానని మాట ఇచ్చాడో మనకనవసరం! ప్రజలతని మాటనమ్మి ఓటేసి అతని పార్టీని గెలిపించారని, ఆ తర్వాత అతనే ప్రధానమంత్రి అయ్యాడని మనం తెల్సుకుంటే చాలు!

అత్యద్భుతమైన మెజారిటీతో ప్రభుత్వాధికారంలోకి వచ్చిన తాతారావు మెంబర్ల తలలు మార్చేసి కొన్నాళ్ళపాటు పార్లమెంటుకి తాళం వేయించేసాడు. దానినే పార్లమెంటుకి సెలవులిచ్చారని ప్రజలు ముచ్చటగా చెప్పుకునేవారు. ఇక అక్కడ్నించి తాతారావు అత్యద్భు

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

తమైన ఆర్డినెన్సులు కొన్ని జారీ చేయించాడు. అందులో మొదటిది ప్రభుత్వోద్యోగులకి జీతాలు తీసేయటం. అలాగని వాళ్ళంతా సమానులు కాలేదు. సోషలిజం చేకూరినట్టూ కాదు. ఎప్పటిలా ఆయా తేడాలతో అలాగే వున్నారు. అయితే, వాళ్ళకి జీవనోపాధి ఎలా? దానికో చక్కని పథకాన్ని ఏర్పాటు చేసింది తాతారావు ప్రభుత్వం.

ఎవరైనా వ్యాపారస్తుడు పర్మిట్‌కనో, లైసెన్సుకనో దరఖాస్తు పెట్టుకున్నాడనుకో! అతను గతంలోలా దానికోసం రోజుల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేదు. అర్జీని అందుకున్న ప్యూన్‌కి ఓ పది, దాన్ని పుటప్ చేసిన గుమస్తాకి ఇరవై, దాన్ని ఫార్వార్డ్ చేసిన సెక్షనాఫీసరుకి ఏభై, ఆ పైన దాన్ని రికమెండ్ చేసిన సూపరిండెంటుకి వంద, చివరికి శాంక్షను చేసిన సెక్రటరీకి రెండు వందలు.. ఈ మొత్తం మూడు వందల ఎనభై రూపాయిల్ని ఓ కవర్లో పెట్టి అర్జీతోపాటు ప్యూను చేతుల్లో పెట్టేస్తే అతనలా హోటలుకి వెళ్లి టీవీలో రెండు డాన్సులు చూస్తూ టిఫిను చేసి బయటికొచ్చి బడ్డీకొట్లో ఓ కిళ్లీ వేసుకుని వచ్చేసరికి అప్రూవ్ అయిన పర్మిట్ పువ్వుల్లో పెట్టినట్టు రెడీగా ఉండేది. దీని గురించి గతంలోలా చాటుగా బల్ల క్రింద నుంచి ఎవర్కీ ఏదీ యివ్వనక్కర్లేదు. ఉద్యోగులతో బేరాలాడనక్కర్లేదు. ఏయే పర్మిట్‌కి, ఏయే లైసెన్సుకి ఎవరి కెంతెంత చదివించాలో లిస్టువ్రాసి పెద్ద పెద్ద అక్షరాలతో ఆఫీసు ముందే బోర్డులు పెట్టేసింది ప్రభుత్వం. ఇంటి దగ్గర్నుంచి బయలుదేరి వెళ్లేవాళ్ళకి సౌలభ్యంగా పత్రికల్లో ఆ ప్రకటనలు సిద్ధంగా ఉండేవి. దాంతో ఎవరెంత డబ్బుని ఇంటినుంచి తీసుకుని వెళ్ళాలో ముందే తెలిసేది. ఒక్కట్రిప్పులో ఆఫీసుకి వచ్చిన వాళ్ళ పని టక్కున జరిగిపోయేది. అయితే, ప్రభుత్వోద్యోగులంతా తమతమ ఆదాయాల్లో పదిశాతం పన్నుని ప్రభుత్వానికి కట్టాలి. దీని కోసం ప్రతి ఆఫీసులోను హుండీలని ఏర్పాటు చేసింది తాతారావు ప్రభుత్వం. ప్రతివారాంతానికి ఆ హుండీలని బ్యాంకులకి చేర్చేవారు. ఖాళీహుండీలు సోమవారం పొద్దుటికి ఆఫీసులకి చేరిపోయేవి.

అలాగే పోలీసుశాఖ. వాళ్ల ప్రతిరోజూ ప్రొద్దున్నే రోడ్ల కూడలిలో ఓ పెద్ద డ్రమ్ముని పెట్టుక్కూర్చునేవారు. ఆ రోడ్డున పోయే ప్రతి మనిషిదాంట్లో రెండు రూపాయిలు వేయాలి. ఎద్దుబళ్ళవాళ్ళు ఐదు, గుఱ్ఱబ్బళ్ళ వాళ్ళు పది, సైకిలు వాళ్ళు పదిహేను, స్కూటరు వాళ్ళు పాతిక, కార్లో వెళ్ళేవాళ్లు ఏభై ఆ డ్రమ్ములో వేసి వెళ్ళాలి. అంటే, ఇల్లు విడిచి ఆ వేళ రోడ్డుమీద అడుగుపెట్టిన ప్రతి మనిషీ పన్ను చెల్లించాల్సిందే! సాయంత్రానికి పోలీసు ఠాణాకి డ్రమ్ముని తెచ్చి అందులో ఎంత జమయిందో లెక్క చూసేవారు. కానిస్టేబులు కింతని, హెడ్‌కానిస్టేబులుకి రెండింతలని, సబిన్స్‌పెక్టరుకి మూడింతలని, సర్కిలుకి నాల్గింతలని, డి.ఎస్.పి కి ఆరింతలని, ఎస్పీకి ఎనిమిదింతలని, ఐ.జి.కి పదింతలని మొత్తాన్ని ఆ నిష్పత్తిలో పంచేసుకునేవారు. అయితే, వీళ్ళంతా కూడా తమ ఆదాయంలో పదిశాతం పన్నుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన హుండీలో భద్రంగా వేసేవాళ్ళు.

ఇలాగే న్యాయశాఖ ఇరుపక్షాల వాళ్ళు డవాలా బంట్రోతు కింతని, బెంచిగుమాస్తాకింతని, లాయరు కింతని, జడ్జీగారికింతని ముట్టచెప్పేవారు. ఇక వాదోప వాదాలతో పనిలేదు. సాక్షుల అవసరం లేదు. ఒక్కోసారి పార్టీలే రానక్కర్లేదు. కాగితాల ఖర్చు లేదు. క్షణాల మీద తీర్పులు జరిగిపోయేవి. అంటే, ఎవరెక్కువ ముట్టచెపితే వాళ్ళపక్షాన తీర్మానాలు తొందరగా జరిగిపోయేవి. ఈ న్యాయ సంరక్షకులంతా పదిశాతం పన్నుని ప్రభుత్వం హుండీలో వేసేవాళ్ళు.

ఆ తర్వాత ఆసుపత్రులు. అక్కడ వార్డుబోయ్ కింతని, నర్సుకింతని, డాక్టరుకింతని, స్పెషలిస్టు కింతని డబ్బులు కట్టేస్తే వైద్యం క్షణాలమీద జరిగిపోయేది. ఒకవేళ మరో ధనవంతుడైన పేషెంటు హఠాత్తుగా వచ్చి ఎక్కువ డబ్బు కడితే మొదటి పేషెంటుని బయట కూర్చోమని చెప్పి ఆ ధనవంతుడికి ముందు వైద్యం చేసేవారు. ఈలోగా మొదటి పేషెంటుకి వికటిస్తే అదంతా అతని కర్మ అని వాళ్ళు వాళ్ళు సరిపెట్టుకొని పోయేవారు. ఏమయితేనేం ఈ కర్మకాండలోని ఆసుపత్రి సిబ్బంది తమ ఆదాయపు పన్ను పదిశాతాన్ని ప్రభుత్వ హుండీలో విధాయకంగా వేసేవారు.


ఆపైన విద్యాశాఖ. స్కూళ్ళు, కాలేజీలు, యూనివర్సిటీలు విద్యార్థుల కోసం రకరకాల సదుపాయాలు కలిగించేవి. క్లాసుల్లో కూర్చుని బుద్ధిమంతుల్లా చదువుకోవాలని ఎక్కడా నియమం లేదు. క్లాసులు ఎగ్గొట్టి ఎక్కడికైనా పోవచ్చు. చీటికీ మాటికీ సమ్మెలు చెయ్యొచ్చు. రాజకీయపార్టీలతో పొత్తులుపెట్టుకోవచ్చు. విద్యాలయాల్లో విద్య కన్న రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యతనివ్వచ్చు. చదువు రాకపోయినా పరీక్షలకి మొక్కుబడిగా కూర్చోవచ్చు. అసలు పరీక్షలు రాయకుండానే సర్టిఫికెట్లు సంపాదించవచ్చు. అంటే, గతంలో ఎవరెవరో దొంగ సర్టిఫికెట్లు ఇచ్చేరాకెట్‌ని నడిపారట. వాళ్ళెందుకు తామే ఆపని చేయచ్చని ఆ రాకెట్‌ని జాతీయం చేసి బోర్డులు, యూనివర్సిటీలు సర్టిఫికెట్లు ఇవ్వనారంభించాయి ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రుల్నుంచి వసూలు చేసిన డబ్బుని టీచర్లు, లెక్చరర్లు, ప్రొఫెసర్లు తమ తమ హోదాల్ని బట్టి పంచుకునేవారు. వీళ్ళంతా కూడ తమ ఆదాయపు పన్నుని ప్రభుత్వ హుండీలో వేసేవారు.

అసలు విద్యాలయాల్లో పొరపాటున కూడ అడుగుపెట్టకుండ సర్టిఫికెట్లు కావాలనుకునేవాళ్ళు ప్రైవేటు దుకాణాల్లో వాటిని కొనుక్కోటానికి అనుమతించింది ప్రభుత్వం. ఆ దుకాణాల్లో సర్టిఫికెట్లే కాకుండ డిగ్రీలు, డాక్టరేట్లు, పతకాలు, ట్రోఫీలు, అమ్మేవారు మరో దుకాణంలో ఇంటర్వ్యూలు అమ్మేవారు. ఇంటర్వ్యూలు దొరికిన వాళ్ళు ఆఫీసుల్లో ఉద్యోగాలు కొనుక్కునేవారు. అక్కడ కూడ వేలంపాట మామూలే! ఎవరెక్కువ ముట్ట చెపితే వాళ్ళకే అన్నీ దొరికేవి.

అలాగే ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, బదిలీలు ఏది కావాలంటే అది చదివించుకునే ముడుపుల్ని బట్టి లభ్యమయ్యేది. కన్సల్టెంట్స్ అని షోగ్గా చెప్పుకునే ఈ షాపులవాళ్ళు ప్రభుత్వానికి పదిశాతం పన్నుని హుండీల్లో వేసేవారు.

మరో రకం షాపులుండేవి. అక్కడ సత్కారాలు, సన్మానాలు, పురస్కారాలు అమ్మేవారు. ఎవరెక్కువ తాంబూలాలు చదివిస్తే వాళ్ళకాస్థాయిలో ఘనంగా జరిగేవి. ఎవరైనా ముందు డబ్బు కడితే వాళ్ళకి ముందుగా జరగాలని లేదు. వెనకవచ్చినా వాళ్ళు కాస్త ఎక్కువిస్తే మునుముందు వీళ్ళకి జరిగిపోయేవి. ఈ విధంగా ప్రతీదీ దేశంలో వేలంపాట జాతీయమైపోయింది.

దేశంలో అన్నింటా అన్ని విషయాల్లో అంతా కట్నాలు, దక్షిణలు, లాంఛనాలు, తాంబూలాలు, వాయనాలు, సంభావనలు, కానుకలు, ముడుపులు, మదుపులు, బక్షీసులు, రుసుములు, మంచిమాటలు, అమ్యామ్యాలు...మనిషిని బట్టి, వృత్తిని బట్టి, సంస్థని బట్టి తలోరకం పేరుతో పిలుచుకుంటూ మామూలు ఇచ్చుకునేవాళ్ళు పుచ్చుకునేవాళ్ళు.



स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत-उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

ఎటువంటి ఆటంకాలు లేకుండా ఎవరికివారు ఇన్ని వ్యాపారాలు చేసుకోవటానికి ఆర్డినెన్సులు జారీ చేసిన ఆ ప్రజాప్రభుత్వం మీద భక్తితో ప్రజలంతా క్రమం తప్పకుండా పన్ను కట్టేవారు.

ఆఖరికి ఇటువంటి ప్రజాపాలనకి ముగ్ధులై పోయిన దొంగలు కూడ ఎవరింట్లో నయినా డబ్బు కొట్టేస్తే దాంట్లో కొంత ప్రభుత్వానికి పన్ను క్రింద కట్టేసి రసీదు తీసుకునేవారు. ఆ రసీదుని చూపిస్తే పోలీసులు వాళ్ళమీద కేసు పెట్టే వాళ్ళుకాదు. ఎవర్నయినా ఎత్తుకువెళ్ళి డిమాండు చేసి పుచ్చుకున్న డబ్బులో కొంత శాతం ప్రభుత్వానికి పన్నుగా కట్టేసి అందుకు మెళ్లో దండలు వేయించుకుని కులాసాగా తమ అడ్డాలకి చేరిపోయేవారు కిడ్నాపర్లు! దొంగ సారా అమ్మితే వచ్చేడబ్బులో కొంత శాతం ప్రభుత్వానికి పన్ను కింద కట్టి ఖుషీఖుషీగా మంత్రుల్ని కూడా ఆహ్వానించి పార్టీలు చేసుకునేవాళ్ళు బట్టీల వాళ్ళు.

ఆ తర్వాత బ్యాంకుల కుంభకోణాల్లో డిపాజిటర్లని ముంచగలిగిన సమర్థులకి దిబ్బశ్రీలని, సెన్సెక్స్ స్కాముల్లో అమాయకుల్ని బికార్లు చేయగలిగిన ప్రతిభావంతులకి దిబ్బ భూషణ్‌లని, ఫోడర్ స్కాముల్లో సామాన్యుల చేత గడ్డితినిపించ గలిగిని మేధావులకి దిబ్బ విభూషణ్‌లని, ప్రభుత్వస్థలాలనే కాకుండ ప్రజల భూముల్ని అవలీలగా ఆక్రమించుకో గలిగిన భవన నిర్మాతలకి మహాదిబ్బ రత్నాలని బిరుదులిచ్చి సత్కరించే వారు!

ప్రభుత్వ ఖజానాలోకి వచ్చిన ధనంలో నాల్గోవంతు మంత్రులు తమ జీతాల క్రింద పంచుకునేవాళ్ళు. మరోవంతు విదేశాలకి విజ్ఞానయాత్రల పేరున విహార యాత్రలకని వెడుతూ ఖర్చుపెట్టుకునేవారు. మరో వంతు భవిష్యత్తులో రాబోయే ఎన్నికల ఖర్చులకని కేటాయించేవారు. చివరివంతుని దేశంలో వరదలు, క్షామాలు, భూకంపాలు వచ్చినప్పుడు ప్రజలకోసం సహాయనిధుల్ని కేటాయిస్తున్నామని చెపుతూ తమ పార్టీ కార్యకర్తలు ఆ నిధుల్ని పంచుకుని ఆనందించే ఏర్పాట్లన్నీ చేసే వాళ్ళు.

ప్రభుత్వ కార్యక్రమాల ధర్మమా అని దేశంలో తినేతిండి, కట్టేబట్ట, ఉండేచోటు అన్నీ డబ్బును బట్టి, స్తోమతును బట్టి, దమ్మునుబట్టి దొరికేవి. దీంతో బలహీనులంతా క్రమంగా కడతేరిపోయారు. దేశమంతటా బలవంతులే కనిపించ సాగారు. కొన్నేళ్ళల్లో దేశంలో కనీ వినీ ఎరుగని మార్పులు జరిగిపోయాయి. పేదవాడన్నవాడు మచ్చుక్కూడా కనిపంచకుండా పోయాడు. ఏమీ కొనుక్కోలేని వాళ్ళు అన్నీ అమ్ముకొని పోయారు. నూకలున్నన్నాళ్ళు బ్రతుకులీడ్చేసి తర్వాత అవతారాలు చాలించేసారు. తీరని కోరికలున్న వాళ్ళు తీరిపోయారు. ఇక దేశంలోమిగిలిన వాళ్ళంతా కోరికలు తీర్చుకోగల సమర్థులే!

తాతారావు తలల మార్పిడి ప్రభుత్వ పరిపాలనలో దేశంలోని దరిద్రం తుడిచిపెట్టుకుపోయింది. ఆ తర్వాత ఐదేళ్ళప్పుడు మళ్ళీ ఎన్నికలు వచ్చినప్పుడు అతనే ప్రధానమంత్రి కావాలన్న ప్రజానినాదాలతో దేశమంతటా దద్దరిల్లిపోయింది. ప్రత్యర్థులు భయపడి ఎన్నికల్లో నిలబడనేలేదు. ప్రజలు ఓట్లేయకుండానే తాతారావు ప్రభుత్వం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నికల కోసం గతంలో కేటాయించిన నిధిని ఖర్చుచేయవల్సిన అవసరం లేకపోయింది కనుక దాన్ని తమకోసం స్వంత బంగళాలని కట్టించటం కోసం కేటాయించేసారు.

అంత అద్భుతమైన మార్పులు తెచ్చిన తాతారావు తర్వాత తరాలకి ఎంతో ఆదర్శప్రాయంగా నిలిచాడు. ఒకే రకమైన ఆర్డినెన్సులతో దేశంలో సామ్యవాదాన్ని సాధించాడు. తను చెప్పిందే నీతి అని ప్రజలు నమ్మేటట్టు చేయగలిగాడు. అవినీతినే ప్రజలకి జీవనాధారంచేసి చూపించాడు.


అయితే, అదే సమయంలో పొరుగున వున్న అధ్వాన్న దేశంలో మరో అవనీతిమయమైన ప్రభుత్వ యంత్రాంగానికి అస్తవ్యస్తం అప్పారావనే రాజకీయ నాయకుడు ప్రధాన మంత్రిగా ఉండేవాడు. కాని, అక్కడ పర్మిట్లకి, లైసెన్సులకి చాలా కాలం పట్టేది. ఎవరెంత పుచ్చుకుంటున్నారో ఇంకొకరికి తెలిసేది కాదు. పోలీసులు లైసెన్సుడ్ గూండాలని పేరు సంపాదించారు. కోర్టుకేసులు ఏళ్ళతరబడీ, తేలేవి కావు. స్కాములు, కుంభకోణాలు, దొమ్మీలు...చేసి జైలుకెళ్ళిన నాయకుల జైల్లోంచే ఎన్నుకోబడేవారు. బెయిల్ మీద బయటికి వచ్చి మంత్రులయ్యేవారు. మధ్యలో మరోకేసులో ఇరుక్కుని జైలుకెళ్ళేవారు. ఈ దోబూచులాటతో ప్రజలంతా అయోమయంలో పడిపోయేవారు. ఎవర్ని నమ్మాల్లో ఎవర్ని నమ్మకూడదో ఎవరికీ తెలిసేది కాదు. అస్తవ్యస్తం పరిపాలనతో అప్పారావు తన యింటిపేరుని నిలబెట్టుకున్నాడే కాని తర్వాత వచ్చిన ఎన్నికల్లో సీటుపోగొట్టుకున్నాడు. ఆతని స్థలంలో ఆర్భాటం అనంతరావనే మరో నాయకుడు ప్రధానమంత్రిగా పదవిలోకి వచ్చాడు.

పార్టీ మారినా, ప్రధానమంత్రి మారినా ప్రజల బ్రతుకులు మారలేదు. అవినీతి అలాగే రాజ్యమేలింది. దేశ దారిద్ర్యం పెరిగిపోయింది. ధనవంతులింకా భాగ్యవంతులవుతుండగా పేదవాళ్ళింకా పరమ దరిద్రులైపోయారు.

***

''రెండు దేశాలలోను అవినీతి ఉంది. కాని, దిరుగుండ దిబ్బ సాధించినంతగా అధ్వాన్న దేశం ఎందుకు చేయలేకపోయింది? దీనికి జవాబు తెలిసి కూడా చెప్పకపోయావో నేనిదివరకు చెప్పినట్టుగానే నీ తల వెయ్యిముక్కలయిపోతుంది'' అని మామూలుగానే హెచ్చరించాడు బేతాళుడు.

దానికి రాజు ఈ విధంగా జవాబిచ్చాడు. ''దిరుగుండ దిబ్బలో అవినీతిని చట్టబద్ధం చేసి ప్రభుత్వ యంత్రాంగానికి మూలంగా చేసి ఉద్యోగులంతా దాని మీదే బ్రతికేలా చేసాడు తాతారావు. నీతిబద్ధమైన అవినీతి వల్ల లాభం చకచకా పనులయిపోవటం. కాని, అధ్వాన్న దేశంలో అలాజరగలేదు. ఉద్యోగులు తమ జీతాలు తాముతీసుకుంటూ అవినీతిని చాటుగా భోంచేస్తూ తాముతప్ప మరెవ్వరూ అలాచేయకూడదని ఆంక్షలు విధిస్తున్నారన్నమాట! వాళ్ళు అవినీతిని ఎలాగా వదలరు. కనీసం డబ్బులు పుచ్చుకున్నాకయినా పనులు కానివ్వరు. అసలు కాలయాపనకే అవినీతిని వాడుకుంటున్నారు. అదే అధ్వాన్న దేశదుస్థితికి మూలకారణం!''




''అవును రాజా! నువ్వు సరిగ్గా చెప్పావు. అవినీతి అంటే అధికారులు వినిపించినదే నీతి అని వాళ్ళు అర్థం చెప్పుకోవటం వల్లనే ఆ దేశం అక్షరాలా అధ్వాన్నమైంది. నువ్వు నోరువిప్పావు. మరి నాకు రెక్కలొచ్చాయి...'' అని నవ్వి శవంతో సహా బేతాళుడు ఎగిరిపోయి మళ్ళీ చెట్టెక్కాడు.